అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు

● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల: జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వంద శాతం మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అభివృద్ధి పనులపై సమీక్షించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, జల్ జీవన్ మిషన్ పథకాలను వినియోగించుకుంటూ అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు చేస్తూ ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని అన్నారు. కొత్త జీపీల్లో సెగ్రిగేషన్ షెడ్లను ఉపాధి హామీ నిధులతో నిర్మించాలని కోరారు. అలాగే జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. డీఆర్‌డీవో శేషాద్రి, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, డీపీవో షరీఫొద్దీన్, పీఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, డీఎల్‌పీవో నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం

తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లెకు చెందిన ఇమ్మడోజు అశ్రిత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజినీరింగ్ మూడో ఏడాది చదువుతోంది. కాలేజీకి ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేక, హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రజావాణిలో చదువు ఆగిపోకుండా చూడాలని వేడుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థిని తల్లిదండ్రులకు కలెక్టర్ రూ.లక్ష ఆర్థికసాయం చెక్కు అందించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

దరఖాస్తుల స్వీకరణ

మధ్యమానేరు ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల నుంచి ఇందిరమ్మ ఇండ్ల పట్టాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. బోయినపల్లి మండలం కొదురుపాక, వరదవెల్లి, నీలోజిపల్లి, గ్రామాల నిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ పట్టా ధ్రువీకరణ పత్రం పొందిన వారి నుంచి ఈనెల 10,11 తేదీల్లో గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో యూరియా సరఫరా కేంద్రాలు

తంగళ్లపల్లి: ఇందిరా మహిళా శక్తి ద్వారా ఎరువులు ఫర్టిలైజర్ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న మహిళలు వ్యాపారంలో రాణించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మండల కేంద్రంలో తేజశ్రీ గ్రామైక్య సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాల దుకాణాన్ని మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని కోరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్, డీఆర్డీవో శేషాద్రి, నాయకులు పాల్గొన్నారు.



గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలో వెంకటాద్రి చెరువు సమీపంలో నర్మాల గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా ఉంది. ఇటీవల ఓ చెట్టు జిమ్ పరికరాలపై పడుతుండగా అధికారులు చెట్టును పాక్షికంగా తొలగించారు. అదే సమయంలో జిమ్ వస్తువులను తొలగించి పక్కన పెట్టేశారు. కానీ పూర్తిస్థాయిలో చెట్టు తొలగించకపోవడం, పరికరాలను తిరిగి బిగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. అధికారులు సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
వినిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, 9553998124

క్లుప్తంగా

విజయవంతం చేయాలి

సిరిసిల్ల అర్బన్ : జిల్లా కేంద్రానికి బుధవారం రానున్న కార్మిక, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లహరి గ్రాండ్ ఫక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి రానున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన అభిమానులు, నాయకులు తరలిరావాలని కోరారు. మాల మహానాడు నాయకులు రమేశ్, గొట్టె లింబాద్రి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం



సీఐ, ఎస్సైని సన్మానిస్తున్న ముస్లిం కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేశ్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరగడంతో సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రాహుల్‌రెడ్డి, ఏఎస్సై ఖాజా మజర్ హుస్సేన్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రముఖ డాక్టర్ హైమద్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ చాంద్‌పాషా, ముస్లిం సంఘం నాయకులు సయ్యద్ లాల్ మహమ్మద్, జహంగీర్, లారీ అహ్మద్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

రుద్రంగి: మండలకేంద్రంలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.47. 25 కోట్ల నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తంచేస్తూ మంగళవారం మండలకేంద్రంలోని ఇందిరాచౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి నా యకులు ఎర్రం గంగ నరసయ్య, గండి నా రాయణ, తర్రె లింగం, కట్కూల్ దాస్, గంధం మనోజ్, గంగాధర్, మల్లేశం, పెద్ద ఎత్తున నా యకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



చందుర్తి : చందుర్తి త హసీల్దార్‌గా ల గిశెట్టి భూపతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ వీటీడీఏకి బదిలీ కాగా, వీటీడీఏలో పనిచేస్తున్న తహసీల్దార్ లగిశెట్టి భూపతి చందుర్తి తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించారు.

ముస్తాబాద్ తహసీల్దార్‌గా రామచంద్రం

ముస్తాబాద్: ముస్తాబాద్ తహసీల్దార్‌గా రామచంద్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సురేశ్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి



వేములవాడఅర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ముషం రమేశ్ అన్నారు. వేములవాడ పట్టణంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో తీవ్రంగా విఫలమైందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ముక్తికాంత అశోక్, ప్రశాంత్, పద్మ, బాబు తదితరులు ఉన్నారు.

పిలుపు పత్రిక ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు

సిరిసిల్లకల్చరల్: సీనియర్ సిటిజన్ల గొంతుకగా వెలువడుతున్న పిలుపు పత్రికను మంగళవారం ఆర్డీవో వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వయోవృద్ధుల సంక్షేమం కోసం రూపొందించిన పలు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పత్రిక నిర్వాహకులను ప్రశంసించారు. వృద్ధుల సంరక్షణ బాధ్యతలను విస్మరించిన వారసులపై చట్టపరమైన చర్యలపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్ల సంఘం బాధ్యులు చేపూరి బుచ్చయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య, దొంత దేవదాస్, ఏనుగుల ఎల్లయ్య, మిట్టపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌కుమార్ తెలిపారు. కొందరిని ఏరియా ఆసుపత్రికి పంపించారు. వైద్యులు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ముస్తాబాద్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక సమస్యలను సీపీఎం నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్తాబాద్‌లో ఎగువ మానేరు ప్రాజెక్టు కుడి కాలువలోకి మురుగు నీరు చేరి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం స్థానిక అధికార పార్టీ నాయకులకు తెలియజేయడం జరిగిందన్నారు. మురుగు కాల్వ నీరు కెనాల్‌లో చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల అధ్యక్షుడు నరేశ్, గీస బిక్షపతి, ఎడ్ల రమేశ్, మహిపాల్, సత్తయ్య, రమేశ్, దేవయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



మానేరు కెనాల్‌లో కలుస్తున్న మురుగునీటిని పరిశీలిస్తున్న నాయకులు

కాళోజీకి నివాళి

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్ల అర్బన్/వేములవాడఅర్బన్/వేములవాడ రూరల్/గంభీరావుపేట/ ముస్తాబాద్/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/చందుర్తి/ఇల్లంతకుంట: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో మహతి మహిళా డిగ్రీ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మారసం అధ్యక్షుడు గెంట్యాల భూమేశ్, గౌరవాధ్యక్షుడు టీవీ నారాయణ, ప్రతినిధులు బూర దేవానందం, ఆడెపు లక్ష్మణ్, అంకారపు రవి, శ్రీనివాస్, అల్లె రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వేములవాడ మండల పరిషత్ కార్యాలయం, పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, వేములవాడ ఏరియా ఆసుపత్రిలో, ముస్తాబాద్ మండలంలో కాళోజీ నారాయణరావు జయంతిని నిర్వహించారు. పెద్దూరు ప్రభుత్వ పాఠశాల, కొండాపూర్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. తుర్కపల్లి పంచాయతీ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వేములవాడ మహాత్మా జ్యోతి బాపూలే బాలికల జూనియర్ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం శాత్రాజు పల్లి రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో భాషా దినోత్సవం నిర్వహించారు.



తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు



సిరిసిల్లకల్చరల్: మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో...

చేశారు. గంభీరావుపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో, దమ్మన్నపేట హైస్కూల్, లింగన్నపేట హైస్కూల్‌లో తెలంగాన భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. లింగన్నపేటలో 35 మంది బాల కవులను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల తదితరులున్నారు. తంగళ్లపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయంలో, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ కార్యాలయంలో, చందుర్తి మండలం జోగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ జయంతిని నిర్వహించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

క్రమశిక్షణతోపాటు చదువులో రాణించాలి

సిరిసిల్లఅర్బన్: విద్యార్థులు క్రమశిక్షణతోపాటు, చదువులో రాణించాలని ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ జైకిషన్ అన్నారు. మంగళవారం పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో ఎల్ఐసీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మేనేజర్ అమరేందర్, ఏఓఆర్ సత్యనారాయణ, ఎజీఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులున్నారు.



విద్యార్థులతో అధికారులు

14న రాజన్న కోడెల పంపిణీ

వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లోని గోశాలలో ఈనెల 14న రాజన్న కోడెలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, పరిసర జిల్లాలోని అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలు పంపిణీ చేయనున్నామన్నారు. సంబంధిత ధ్రువపత్రాలతో https://rajannasiricilla.telangana.gov.in/లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

హామీ అమలుచేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సుంకబోయిన మహేశ్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకబోయిన మహేశ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ హక్కుల సాధనకోసం బుధవారం కరీంనగర్‌లో తలపెట్టనున్న బహిరంగసభ కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరారు. 57 ఏళ్లు నిండిన మత్స్యకారులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముది రాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, గౌరవాధ్యక్షుడు కర్నాల భద్రాచలం, జిల్లా ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, రాష్ట్ర టీఎంపీఎస్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మకు బోనం



నెత్తిన బోనాలతో బద్దిపోచమ్మ గుడికి వెళ్తున్న భక్తులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనంమొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో రాజన్నగుడి మెట్ల వద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి ఊరేగింపుగా పోచమ్మ తల్లి ఆలయానికివెళ్లి అమ్మవారికి బోనం,కల్లుసాక, పట్నంమొక్కులు చెల్లించారు.

ఎంపీడీవో తనిఖీ

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట, మండెపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో లక్ష్మీనారాయణ పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం, ప్లాంటేషన్, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవోతోపాటు ఏపీవో నాగరాజు, జేఈ రాజనర్సు, పంచాయతీ కార్యదర్శులున్నారు.

ఇసుక లారీ, టిప్పర్ సీజ్

తంగళ్లపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ, టిప్పర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. మండలకేంద్రం శివారులో తనిఖీలు చేస్తుండగా సిరిసిల్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇసుక లారీ, టిప్పర్ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్‌చేశామన్నారు. కరీంనగర్‌కు చెందిన బానోతు వెంకటేశ్, టాంగ్ర సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు అవగాహన

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్, సీహెచ్‌వో రమేశ్, ప్రత్యేకాధికారి వసంత, వైద్య సిబ్బంది రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ఇల్లంతకుంట: గాలిపెల్లి ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం పల్లె దవఖాన వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. పల్లె దవాఖాన డాక్టర్ కే రమేశ్, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు భారతి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని దుమాల ఏకలవ్య గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పిరికితనంతో ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. పరీక్షలంటే భయం వీడాలన్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

బోయినపల్లి: వెంకట్రావుపల్లికి చెందిన పోతుల అరవింద్ (21) ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. అరవింద్ నేత్రాలు కుటింబీకులు దానం చేశారు. నిరుపేద కుటుంబ కావడంతో వెంకట్రావుపల్లి యువకులు మంగళవారం కొదురుపాకలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి బాధిత కుటుంబానికి కుటంబానికి అండగా ఉంటామని తెలిపారనన్నారు.

'కొండూరి'కి సన్మానం

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్ గులాం చెరువుకు బుంగ పడిందని, సాగునీటి కాలువలు శుభ్రంగా లేవని తెలపడంతో నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సమస్యను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం రైతులు కొండూరిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కేటీఆర్ సొంత ఖర్చులతో వాహనం ఏర్పాటు చేసి బుంగ పూడ్చడం, కాలువలను శుభ్రం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు బండ రమేశ్, నర్సింగారావు, శివంది దేవేందర్, వెంకటి, తిరుపతి, రాజేందర్, సెస్ మండల డైరెక్టర్ నారాయణరావు, వెంకటస్వామిగౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


పిచ్చిమొక్కలు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి చౌరస్తా నుంచి కొత్తపేటకు వెళ్లేదారిలో వైన్‌షాపు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పిచ్చి మొక్కలతో ప్రమాదకరంగా ఉందని ఈనెల 1న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించారు.

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం



ఇల్లంతకుంట: మండల ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగం అనిల్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చింతల పెల్లి వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రంగు రజనీ కుమార్, కోశాధికారిగా న్యాత అశోక్, సలహాదారులుగా అంతగిరి వినయ్ కుమార్, అనగోని యాదగిరి గౌడ్, గౌరవ అధ్యక్షులుగా ఎంగ్రచందన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కుల సంఘాలకు రూ.2.50 కోట్లు

వేములవాడ: ప్రజా ప్రభుత్వంలో కుల సంఘాలు పండుగలు చేసుకునే అవకాశాలు కల్పిస్తున్నామని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో 9,10,11,12 వార్డుల్లో పలు కుల సంఘాల భవనాల నిర్మాణనికి మంజూరైన ప్రొసీడింగ్ పత్రాలను మంగళవారం అందజేశారు. మొత్తం రూ.2.50కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వేములవాడలో పట్టణ జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని, అభివృద్ధి చూసి ఓర్వలేక కొందరు భవిష్యత్‌లో తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రజల వద్దకు ప్రభుత్వం వస్తుందని, రాబోయే రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మీ ఆశీర్వాదం అందించాలని విజ్ఞప్తి చేశారు.



మంజూరు పత్రాలు అందజేస్తున్న విప్ ఆది

పెన్షన్ బెనిఫిట్ ఇప్పించండి

తమకు పెన్షన్ బెనిఫిట్ ఇప్పించాలని ఆలయ విశ్రాంత ఉద్యోగులు మంగళవారం విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. విప్ వెంటనే రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, లా సెక్రటరీ పాపిరెడ్డితో ఫోన్లో మాట్లాడారు. త్వరలోనే పెన్షన్ బెనిఫిట్స్ వచ్చేలా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విప్‌కు సన్మానం

రాజన్న ఆలయానికి ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ మంజూరుపై ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌ను ఆలయ ఉద్యోగులు మంగళవారం చైర్మన్ ఛాంబర్లో ఘనంగా సత్కరించారు. ఈవో రమాదేవి, ఏఈవోలు శ్రవణ్, అశోక్, శ్రీనివాస్, జయకుమారి, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈ రాంకిషన్‌రావు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేములవాడ కళాభవన్ నేలమట్టం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయం ప్రాంగణంలో మూడు దశాబ్దాలకుపైగా కళా–భక్తి సమ్మేళనానికి వేదికై న కళాభవన్ నేలమట్టమైంది. సుమారు 33 ఏళ్లక్రితం (21 జనవరి, 1992) నిర్మితమైన ఈ భవనం తొలుత కళాకారులు, కవులకు సృజనాత్మక వేదికగా మారి ఎన్నో సాంస్కృతిక వేడుకలకు వేదికైంది. రాత్రి వేళలలో నాటక రూపకాలు, కవి సమ్మేళనాలు, సంగీత కచేరీలు ఇక్కడ జరిగి ప్రేక్షకులను అలరించాయి. ఏటా వైభవంగా జరుపుకునే త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో మేటి కళాకారులు సైతం ఈ వేదికపై తమ ప్రదర్శనలిచ్చిన వారిలో ఉన్నారు. ఈనెల 9న పూర్తిగా నేలమట్టమైంది.



నేలమట్టమైన కళాభవన్

కళలకు వేదిక

33 ఏళ్ల క్రితం నిర్మించిన కళాభవన్ కళాకారులు, కళాభిమానులకు స్థలాభావం కావడంతో రాష్ట్ర దేవాదాయశాఖ ఓపెన్‌స్లాబ్‌లో హాల్ నిర్మించారు. ఇందులో ఉత్సవాలు, వేడుకలు, కళా ప్రదర్శనలు నేటికీ జరిగాయి. ఆ తర్వాత ఈ భవనంలో స్వామివారి నిత్య కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, వివిధ హోమాలు ఇక్కడ నిర్వహించారు.

త్వరలోనే కొత్తభవనం

ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా అధికారులు దీన్ని కూల్చివేశారు. త్వరలోనే ఇక్కడ ఆధునిక వసతులతో కొత్త భవనం నిర్మించనున్నారు. ఎప్పుడో మా మొదటి నాటకం ఇక్కడే ప్రదర్శించాం. కవితా గానం ఇక్కడే జరిగింది. స్వామివారి కల్యాణం ఇక్కడ చూసిన అనుభూతి వేరే అని ఇప్పుడు ఇవన్నీ జ్ఞాపకాలుగానే మిగులుతున్నాయని పలువురు తెలుపుతున్నారు.

ఎవరో వస్తారని.. ఎదురు చూడక..

సిరిసిల్ల: ఆ రోడ్డు గుండా నిత్యం రైతులు పొలాల వద్దకు వెళ్లాలి. కానీ ఇటీవల వర్షాలకు పూర్తిగా చెడిపోయింది. రగుడు ఎస్సీ కాలనీ నుంచి రంగినేని ట్రస్ట్ వరకు వెళ్లే 18 అడుగుల రోడ్డు నడిచేందుకు, బండిపై వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయింది. రగుడు ఊరు సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం కావడంతో ఆ రోడ్డు గురించి పట్టించుకునే నాథుడు లేరు. అదే గ్రామపంచాయతీగా ఉంటే.. స్థానిక పాలకవర్గం రోడ్డు అవసరం తెలిసి బాగు చేసే వారు. కాగా, ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ఓ యువకుడు సొంత ఖర్చులతో రోడ్డును బాగు చేయించాడు. రగుడుకు చెందిన బూర యాదగిరి ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకుని కిలోమీటరు రోడ్డును మంగళవారం శుభ్రం చేసి పొలాలకు వెళ్లే రైతులకు, ఆ దారిలో వెళ్లే ఎస్సీ కాలనీ వాసులకు మెరుగైన రోడ్డు వసతి కల్పించారు. స్థానికులు ఆ యువకుడిని అభినందించారు.



రగుడు శివారులో పొలాలకు వెళ్లే రోడ్డు దుస్థితి



రోడ్డును ట్రాక్టర్‌తో చదును చేస్తూ..

సర్వే బకాయిలు విడుదల చేయాలి

వేములవాడరూరల్: సమగ్ర కుటుంబ సర్వే బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ అన్నారు. ఎస్ టీయూ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో సభ్యత్వం స్వీకరించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల కోనాయపల్లిలో ఎస్టీ యూ వేములవాడ అర్బన్ మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. ఎస్‌టీయూ వేములవాడ మండల అధ్యక్షుడిగా తి రుపతి, మండల ప్రధాన కార్యదర్శిగా సదానందం తదితరులను ఎన్నుకున్నారు.